మయూరి వీక్లీ
31 జూలై 92

సార్థకత లభించింది. నీతో నా బ్రతుకుని పంచు కుంటే నా జన్మ తరిస్తుంది. నీవు దూరమైన నిన్ను ధ్యానిస్తూ మరో జన్మదాకా ప్రేమ తపస్సు సాగిస్తాను. మరో వ్యక్తితో జీవితాన్ని పంచుకో లేను. ఊహించుకోలేను. నిన్ను చూసిన కళ్లతో ఇతర్లని చూడలేను. నీకై అర్పించిన ఈ మనస్సు నీ తోనే ఉంటుంది. ప్రియతమ్... ప్రేమ భిక్ష ప్రసాదించమని వేడుకుంటున్నాను. జీవితాంతం నీ సాహచర్యంతో నా జన్మని పునీతం చేసుకునే అవకాశం కల్పించమని కోరుతు న్నాను. నీ నుంచి అంగీకారమే అందుకుంటా నని ఆశిస్తున్న నీ కావ్యనాయక, నీ జీవిత రాణి. నీకై తపించే నీ ప్రేయసి.

— వి. నిర్మలా ప్రియదర్శిని, బద్వేల్.



## ప్రేమించవా చెలీ!

ప్రియమైన,

నీ ఉత్తరం ఇప్పుడే అందింది. నీవు రెండు నెలల సుదీర్ఘయాత్రకు వెళుతున్నావని ముందే తెలిసిన, నీవు వెళ్ళిపోయావని ఖచ్చితంగా ఇప్పుడే తెలుసుకున్నాను. మన కాలేజీ ఈ మధ్యనే ప్రారంభమైనా ఇప్పుడే వెళ్ళడానికి మనసొప్పడంలేదు. ఎందుకో నీకు అర్థమైపోవచ్చు. ఇంకో వారంరోజుల వరకు వెళ్ళకూడదనుకొంటున్నాను. అలా అని ఇంట్లో కూచోవాలని కూడా లేదు. ఏం చేయాలో కూడా తోచడం లేదు. నీవు లేని ఈ రెండు నెలలు నీవు అతిగా ఇష్టపడే ప్రేమ కవితలను వ్రాయాలని నిశ్చయించుకొన్నాను. నీవు వచ్చే వరకు ప్రేమ కవిని కాకపోవచ్చు గాని నీ ప్రేమ తాపసిగా తప్పకుండా ఉండగలను.

ఈ రెండు నెలల కాలంలో నీ అడ్రస్ ఇచ్చి తంగా లభించదనే ఉద్దేశ్యంతో నీవు అతిగా అభిమానించే, ఇప్పుడే ఈ 'మయూరి' పత్రికలో నా ప్రేమలేఖను వ్రాస్తున్నాను. నీవు ఎక్కడ ఉన్నా 'మయూరి'ని తప్పక కొంటావనే నమ్మకం నాకుంది. ఈ ఉత్తరం 'మయూరి' ద్వారా చదివిన మరుక్షణమే ప్రేమలేఖ వ్రాయగలవనే నమ్మకంతో ప్రతిరోజు నీ ఉత్తరం కొరకు ఎదురు చూసే నీ ప్రియ

ఎం. లక్ష్మీనారాయణ

# ఓ మనిషికథ

**- మినీకథ -**

అతనికో పెద్ద డిగ్రీ వుంది. బుర్రలో కావల్సినన్ని తెలివి తేటలున్నాయ్. ఉద్యోగాలు పేదింటోడికి వచ్చినా ఐశ్వర్యపు మట్టాల్లా ఏదో మొక్కుబడిగా వస్తున్నాయ్. వెంటనే పోతున్నాయ్. చూడ్డానికతడు దురదృష్టపు బల్లెపుపోటు తిన్న క్షతగాత్రుడిలా వున్నాడు.

'ఏయ్ ఎక్కడికి వెళ్ళిపోతున్నావ్' అడిగాడతను.

'ఎక్కడికో ఓ దగ్గరికి... ఎవ్వరికీ కన్పించని చోటికి'

నవ్వాడతను. ఇప్పుడు మాత్రం నువ్వు ఎవరికి కన్పిస్తున్నావనేమో అతని భావం.

'ఏం కోపమా?'

'కాదు...బాధ'

'ఎందుకు'

'నా వల్లనే నీకీకష్టాలు'

'నీవల్లనని ఎవరన్నారు...? అది నా ఖర్మ...'

'కాదు... ఖర్మకాదు. నావల్లనే... నేను లేక పోతే నీకీ కష్టాలుండవు..'

'బలే చెపుతున్నావ్ బహుశా నావాంటి వాటితో పాటు కలిసుండటం నీకిష్టం లేదేమో! గతంలా నువ్వు...'

'నిజం... నాగతం గొప్పదే... నా చరిత్ర చరిత్రకే వన్నెతెచ్చేదీ... కాని అది కేవలం గతం ... వర్తమానం వేరు. నేను వెళ్ళిపోతున్నాను నన్నాపకు'

'నువ్వున్నావని ఎన్ని లేకపోయినా లెఖ్ఖ చెయ్యకుండా బ్రతికాను. అలాంటిది నువ్వే వెళ్ళిపోతానంటే...'

'నువ్వు సుఖపడతావు. ఏమీ లేకపోవడం అన్న ప్రశ్న ఉండదు. నేను లేకపోతే నీకన్నీ లభ్యం అవుతాయ్'

'ఎందుకో అంత విరక్తిగా మాట్లాడుతావు. నువ్వున్నావనే ధైర్యంతో యిన్ని కష్టాల మధ్య కూడా సంతృప్తిగానే వుంది నాకు... నాకు లేని విరక్తి నీకెందుకు?

'ఎందుకు నామీద అభిమానం పెంచుకుని నన్ను బంధించెయ్యాలని చూస్తావ్... నా మూలంగా నీకెదురవుతున్న కష్టాలు చూస్తూ నేను భరించలేక పోతున్నాను.'

'లేదు. నువ్వు ఆవేశంతో బాధలో ఏదో మాట్లాడుతున్నావు. బాధలు...సమస్యలు... ఒకరివల్ల వచ్చేవికావు. అది మనిషి పూర్వజన్మ వాసనలబట్టి వస్తాయ్.



హు... నిజాన్ని ప్రక్కదారి పట్టించడానికి ... ఓదార్పుచెప్పి మనిషిని మభ్యపెట్టడానికి ఉపయోగపడే మాట 'పూర్వజన్మఫలం' నీ ప్రక్కనే బ్రతుకుతున్న కోట్లాది ప్రజల్ని చూడు. ఎంత హాయిగా బ్రతుకుతున్నారో.... సుఖానికి ... కష్టానికి కారణాలు పూర్వజన్మ ఫలాలు కాదు. నాలాంటి దాన్ని నువ్వు చేరదియ్యడం వల్లనే.... ఇంకనేనుండను.'

'అంటే, వెళ్ళిపోతున్నావా!'

'ఆ..'

'అదే నీ నిర్ణయమా!'

'ముమ్మాటికి' కన్నీళ్ళతో నీ ...లు చెబుతూ వెళ్ళిపోయింది... అతనిలో ఇన్నాళ్ళు అంతర్భాగంగా మెలిగిన మానవత్వం... మంచితనం.

'ఇన్నాళ్ళు కలిసున్నా... నువ్వులేని బ్రతుకు నాకెన్నివున్నా అనవసరమే... వాపోయాడతను ... పోయాడతను.. పాపం అతనికాలం మనిషి కాదు...

— తొత్తడి గణపతిరావు.